క్లుప్తంగా

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



నెహ్రూనగర్: సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుంచి అదిత్యనగర్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన డ్రెయిన్ నిర్మాణాలు, కల్వర్టు పనుల్లో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిత్యనగర్‌కు వెళ్లే దారిలో బ్యాంక్ కాలనీ దగ్గర కల్వర్టును పూర్తిస్థాయిలో నిర్మించకపోవడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సదరు ప్రాంతంలో కల్వర్టును పూర్తిస్థాయిలో నిర్మించి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

30 మందికి సెల్‌ఫోన్ల అప్పగింత

నగరంపాలెం: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి కోసం నాలుగు నెలల కిందట ప్రారంభించిన పోలీస్ వాట్సాప్ నంబర్‌కు విశేష స్పందన లభిస్తోందని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఆవరణలో సోమవారం 30 మందికి సెల్‌ఫోన్లను తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న వారి కోసం వాట్సాప్ నంబర్ 86888 31574ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఈ నంబర్‌ను బాధితులు సద్వినియోగం చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు వందల్లో మొబైల్‌ఫోన్లను అప్పగించామని వెల్లడించారు. నంబర్ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎస్బీ సీఐ బి.నరసింహారావు, ఆర్ఐ రాజారావు, ఎస్ఐ డి.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

జీజీహెచ్ ఉద్యోగుల సమస్యలపై వినతి

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏపీటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వడ్డె బాలయ్య ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంప్లాయీస్ సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన వినతిపత్రంపై ఇప్పటి వరకు ఆసుపత్రి నుంచి పరిష్కారం లభించలేదని తెలిపారు. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో ఈ-1, ఈ-2, అకౌంట్స్ సెక్షన్ విభాగంలో ఏ-4, ఏ-6 విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పనితీరుపై అభ్యంతరం వ్యక్తం చేశామని, గతంలో వారి సీట్లు మార్చాలని లిఖితపూర్వకంగా కోరినా ఇప్పటి వరకు చేయలేదని పేర్కొన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ మామూళ్లకు అలవాటు పడి ఉద్యోగుల్ని వేధిస్తున్నారని, ఆయన్ను తక్షణమే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ 30 నుంచి ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆసుపత్రిలో నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు బాలయ్య వెల్లడించారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూనియన్ నేతలు నాగరాజు, కృష్ణ, కుమార్‌రాజా, బాలాజీ, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రవేశాలు కల్పించని యాజమాన్యాలపై చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009 ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు చేపడతామని ఆర్జేడీ వి.ఎస్. సుబ్బారావు, డీఈవో పి.శైలజ సోమవారం వేర్వేరు ప్రకటనలో హెచ్చరించారు. అర్హులైన పేద విద్యార్థులకు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి కేటాయించిన సీట్లలో చేరేందుకు ఆదివారం ముగిసిన తుది గడువును ప్రభుత్వం మంగళవారం వరకు పొడిగించిన దృష్ట్యా, సంబంధిత విద్యార్థుల్ని పాఠశాలల్లో చేర్చుకోవాలని యాజమాన్యాల్ని ఆదేశించారు. రెండో విడతలో కేటాయించిన సీట్ల జాబితాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ కామ్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులతో పాటు ప్రవేశం పొందని వారి వివరాల్ని నిర్ణీత ప్రొఫార్మాలో పూర్తిచేసి డీఈవో కార్యాలయంలో ప్రత్యేక మెసెంజర్ ద్వారా మంగళవారం సాయంత్రం 5.00 గంటలలోపు పంపాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్ని అమలు పర్చడంలో ఎంఈవోలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేని పక్షంలో చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఏఎస్పీ సుప్రజ ఆకస్మిక తనిఖీ

పట్నంబజారు : జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆర్మ్ రిజర్వ్‌డ్ విభాగాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు అంశాలకు సంబంధించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. పాత గుంటూరులోని కాపు కల్యాణ మండపంలో సోమవారం 8, 10వ డివిజన్ల వలంటీర్లకు సన్మానం, అవార్డుల ప్రదానం చేశారు. 3,9 డివిజన్ వలంటీర్లకు శ్రీకృష్ణ కల్యాణ మండపంలో సత్కరించి, అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో విప్లవాత్మక నిర్ణయాన్ని తీసుకుని, ప్రజల ముంగిటకే పాలన అందజేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా వలంటీర్లు పనిచేస్తున్నారని, వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, పలు విభాగాల నేతలు నూరి ఫాతిమా, యర్రి ధనలక్ష్మి, మీరావలి, పోలవరపు జ్యోతి, యర్రి సాయి, పుల్లా కిశోర్, పోలవరపు వెంకటేశ్వర్లు, సుభాని, శ్రీనివాసరెడ్డి, యాట్ల రవి, ఆర్. భాస్కర్, తోట ఆంజనేయులు, చింకా శ్రీనివాసరావు, కె. కోటేశ్వరరావు, కె. వసుమతి, మాధవ్, అంకమ్మరావు, స్వర్ణ, లీలాకృష్ణ, బ్రహ్మానాయుడు, వెంకటేశ్వర్లు, బాబు, దుర్గాప్రసాద్, బాలా, ముని, ఆదినారాయణ పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ నేతలు



బైక్ ర్యాలీలో పాల్గొన్న పార్టీ నేతలు, కార్యకర్తలు

ఆకట్టుకున్న బైక్ ర్యాలీ

ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు అసత్య ప్రచారాల్ని నిరసిస్తూ సోమవారం తూర్పు నియోజకవర్గ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మహిళా నేత నూరి ఫాతిమా ఆధ్వర్యంలో నెహ్రూనగర్ ఎన్వీ రంగారావు విగ్రహం నుంచి ప్రధాన వీధుల్లో జరిగింది. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మంచి చేస్తుంటే చూసి ఓర్వలేక టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. మహిళా పక్షపాతిగా ఆయన ఇళ్ల పట్టాలు అందజేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు చేసిన మేలు శూన్యమని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ 'స్పందన'కు 32 ఫిర్యాదులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

నెహ్రూనగర్: స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సీడీఎంఏ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్ సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని, వాటిని నిర్దేశిత గడువులోనే పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని ఆదేశించారు. సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 32 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 10, ఇంజినీరింగ్ విభాగానికి 11 , ప్రజారోగ్య విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 2 , ఉపా సెల్ విభాగానికి 2, పరిపాలన విభాగానికి 3 చొప్పున ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, కార్పొరేటర్లు

నెహ్రూనగర్: తాగునీటి సరఫరాపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందని, పాత పైప్‌లైన్ల స్థానంలో ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా కొత్తవి వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరంలో నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి లక్ష్మీపురం హెచ్ఎల్ఆర్ రిజర్వాయర్‌కు తాగునీరు సరఫరా చేసే 800 ఎం.ఎం. డయా పైప్‌లైన్‌కు సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద తరచుగా లీకులు ఏర్పడి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో నెహ్రూనగర్ నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటు వరకు నూతనంగా రూ.2 కోట్లతో చేపట్టనున్న 900 ఎం.ఎం. డయా పైప్‌లైన్ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పాత పైప్‌లైన్ వేసి 60 ఏళ్లు అవుతుందని చెప్పారు. దీనికి తరచుగా లీకులు ఏర్పడటం, మరమ్మతులకు అధిక మొత్తంలో నిధులు ఖర్చులు అవ్వడంతో పాటు నీరందక ప్రజల ఇబ్బందులు దృష్ట్యా కొత్త పైప్‌లైన్ వేయనున్నట్లు చెప్పారు. పైప్ లైన్ రీప్లేస్మెంట్ చేసే సమయంలో శివారు ప్రాంతాలకు తాగు నీటి సరఫరాలో కొంతమేర అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజిల, కార్పొరేటర్లు అయిసెట్టి కనకదుర్గ, నిమ్మల వెంకటరమణ, ధూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, అగ్గిపెట్టి రాజు, కోఆప్షన్ సభ్యుడు పూనూరి నాగేశ్వరరావు, ఈఈ కోటేశ్వర రావు, డీఈఈ శ్రీనివాసరెడ్డి, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

1 నుంచి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రచారం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): జాతీయ బాలల హక్కుల కమిషన్ ఆదేశాల మేరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రచార కార్యక్రమాలు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలియజేశారు. సోమవారం ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో బాల కార్మికుల నిర్మూలనపై జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో, స్టేక్ హోల్డర్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికుల నిర్మూలనపై జరిగే ప్రచార కార్యక్రమాలను మండల, గ్రామ స్థాయిలోని అధికారులందరూ టాస్క్ ఫోర్స్ అధికారులకు సహకరించాలని ఆదేశించారు. జిల్లాలో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహించుటకు గాను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.మనోరంజని నోడల్ అధికారిగా వ్యవహరించాలన్నారు. జూన్ 12న ప్రపంచ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని టాస్క్‌ఫోర్స్ అధికారులతో ర్యాలీని నిర్వహించాలన్నారు.

ఆన్‌లైన్‌లో తెలుగు పుస్తకాలతో విజ్ఞానం



మరో గ్రంథాలయ ఉద్యమం బ్యానర్‌తో వెంకటేశ్వరరెడ్డి, బత్తుల దేవానంద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆన్‌లైన్‌లోని తెలుగు పుస్తకాల్ని చదవడం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మరో గ్రంథాలయ ఉద్యమం కన్వీనర్ మంచికంటి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం సందర్శించిన వెంకటేశ్వరరెడ్డి ''మరో గ్రంథాలయ ఉద్యమాన్ని నిర్మిద్దాం-సమాజానికి చికిత్స చేద్దాం రండి'' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువు అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తెలుగు పుస్తకాలను చదవాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ విద్యార్థులు, పాఠకులకు అవసరమైన వసతుల్ని కల్పించామని తెలిపారు. గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే మెటీరియల్‌ను అందుబాటలలో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, గ్రంథ పాలకులు ఎస్. నాగిరెడ్డి, ఐ.వి.దుర్గారెడ్డి పాల్గొన్నారు.

భవ్య ఐవీఎఫ్ హాస్పిటల్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ జ్యోతి

గుంటూరు మెడికల్: సంతాన లేమితో బాధపడుతున్న వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో గుంటూరు నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో హాస్పిటల్ ప్రారంభించడం అభినందనీయమని డాక్టర్ జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులో భవ్య ఐవీఎఫ్ అండ్ ఫెర్టిలిటీ హాస్పిటల్‌ను ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ వైద్యులు ఆధునిక చికిత్సలో చెన్నైలో నైపుణ్యం పొంది గుంటూరు ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ దుంపా శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ సింధు మందాల, డాక్టర్ అన్నపూర్ణ భవ్య ఏరువ, డాక్టర్ రేవతిరెడ్డి ఏరువ, డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా సంతానలేమితో బాధపడుతున్న దంపతులు తమ హాస్పిటల్ ద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీ, నైపుణ్యం గల వైద్య బృందం 24 గంటలూ తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ల్యామినర్ ఎంబ్రియాలజీ ల్యాబ్ ద్వారా పిండం ఎదుగుదల, నాణ్యత అత్యుత్తమంగా ఉండటం వల్ల ఎక్కువ సక్సెస్ రేటు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఏపీపీల గౌరవ వేతనం పెంచాలి



గుంటూరు లీగల్: జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌కు చెల్లిస్తున్న గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ విజయవాడలోని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సుదర్శన్‌రెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(టెన్యూర్) వెల్ఫేర్ అసోసియేషన్ (ఏపీపీపీ (టెన్యూర్)డబ్ల్యూఏ) ప్రెసిడెంట్ సీహెచ్.వి.సత్యనారాయణ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టు ఏపీపీలకు ఇస్తున్న గౌరవ వేతనం రూ. 40 వేలను లక్షకు, సబ్ కోర్టు ఏపీపీలకు ఇస్తున్న రూ.25 వేలను రూ.60 వేలకు పెంచాలని కోరినట్లు చెప్పారు. దీంతోపాటు గెజిటెడ్ ర్యాంక్, వెహికల్ అలవెన్స్, హెచ్ఆర్ఏ, బీమా తదితర ప్రయోజనాలను కల్పించాలని కోరినట్లు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సానుకూలంగా స్పందిస్తూ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ డీవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ స్మారక పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై సోమవారం సాయంత్రం సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు సౌజన్యంతో యువకళా వాహిని ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి పురస్కరించుకుని పురస్కారాల్ని ప్రదానం చేశారు. సభకు యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ కళారంగానికి సారిపల్లి కొండలరావు సేవలు ప్రశంసనీయమని తెలిపారు. అనంతరం కె.వెంకటేశ్వరరావు, వల్లూరి శివప్రసాద్, ఆలపాటి లక్ష్మి, గోపరాజు రమణ, డాక్టర్ పి.ఎస్.ఎస్.కృష్ణకు ఎన్టీఆర్ స్మారక పురస్కారాల్ని అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం గుంటూరుకు చెందిన అమృత లహరి నిర్వహణలో నాన్న నేనొచ్చేస్తా సాంఘిక నాటిక సందేశాత్మకంగా సాగింది. డాక్టర్ డి.ఎస్.ఎన్. మూర్తి, కావూరి సత్యనారాయణ, శివశంకరశాస్త్రి, శారదా కళా సమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరా వు, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమాల్ని సంస్థ ప్రధాన కార్యదర్శి జి. మల్లికార్జునరావు, బొప్పన నరసింహారావు, తిరుమలేశ్వరరావు నిర్వహించారు.

వృద్ధురాలిపై దాడి

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలిపై కుమారుడు, కోడలు దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటలో నివాసం ఉంటున్న సుబ్బమ్మపై ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో మూడో కుమారుడు గురవయ్య, అతని భార్య లక్ష్మి సోమవారం దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్న ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. స్తంభాల గరువుకు చెందిన శ్రీనివాసరావు కుమార్తె భవానీతో నేలపాటి మురళీకృష్ణకు వివాహమైంది. అదనపు కట్నం కోసం మురళీకృష్ణ, తండ్రి కొండయ్య, తల్లి మహాలక్ష్మి భవానీని వేధింపులకు గురి చేశారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాలిక అదృశ్యం

బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శివనాగరాజు కాలనీలో నివాసం ఉండే ఓ కుటుంబానికి చెందిన బాలిక సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బిల్డర్ల మోసంపై కేసు నమోదు

బిల్డర్ల మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనులో ఆర్.ఆర్.టవర్స్ పేరుతో షేక్ సద్దామ్ హుస్సేన్, షేక్ అబ్దుల్ కరీం అపార్టుమెంట్ నిర్మాణం ప్రారంభించారు. ఒక్కో ఫ్లాట్‌ను రూ. 45 లక్షలకు విక్రయించారు. ఫుల్ ఫర్నిషడ్ ఫ్లాట్లు అప్పజెబుతా మని ఒప్పందంలో పేర్కొన్నారు. అయితే అపార్టుమెంట్‌లో ఫ్లాట్లు నిర్మాణం పూర్తి చేయకుండా నిలిపివేశారు. బాధితుడు ఎం.సురేష్‌రెడ్డి, మరో ఎనిమిది మంది సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సామాజిక బాధ్యతతో ప్రజలు మెలిగినప్పుడే అభ్యున్నతి



డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న యూనియన్ నేతలు

గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలిగినప్పుడే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి సాధ్యపడుతుందని గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సోమవారం గుంటూరు ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అభివృద్ధి పనుల్ని డీఎంహెచ్‌వో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ పిలుపు మేరకు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ నేతలు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం భారీ స్థాయిలో వితరణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మంగళగిరి, తెనాలి, చేబ్రోలులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, వసతి గృహాల్ని అభివృద్ధి చేస్తామని యూనియన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్‌బాబును యూనియన్ నేతలు సన్మానించారు.

నిర్దాక్షిణ్యంగా చెట్టు నరికివేత



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీనగర్ ఒకటో లైనులో నిర్మాణంలో ఉన్న భవనానికి అడ్డుగా ఉందనే కారణంతో భారీ వృక్షం కొమ్మలు నరికివేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రోడ్డుపై ఉన్న పచ్చని చెట్టు నిలువునా కొమ్మలు నరికివేసి రోడ్డు పక్కన పడేశారు. దీంతో పచ్చగా, చల్లటి నీడను ఇస్తున్న వృక్షం కాస్తా మోడువారిపోయింది. విషయం తెలుసుకున్న నగరపాలకసంస్థ అధికారులు అక్కడికి చేరుకుని, అనుమతి లేకుండా చెట్టును నరికినందుకు, సంబంధిత భవన నిర్మాణదారునికి నోటీసు ఇచ్చారు. జరిమానా కూడా విధించినట్లు నగరపాలకసంస్థ ఉద్యాన విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు తెలిపారు. నగర పరిధిలో చెట్లను నరకడం చట్టరీత్యా నేరమని చెప్పారు. ఇళ్లకు అడ్డుగా ఉన్న పక్షంలో నగరపాలకసంస్థ నుంచి అనుమతి తీసుకుని, కొమ్మలనే నరకాలని స్పష్టం చేశారు.